

పాఠశాలకు ఉపాధ్యాయుల చేయూత
- శిథిలావస్థకు చేరిన పాఠశాలకు మరమ్మతులు
- సొంత నిధులతో మొరం, పెయింటింగ్ పనులు చేయించిన టీచర్లు 6

కారులో రూ. 10 లక్షలు చోరీ
పట్టించిన సీసీ కెమెరాలు 7




సీఎస్ఐకి భక్తుల బారులు

రెండో రోజూ తగ్గని రద్దీ

మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ వేడుకల రెండో రోజు భక్తులు, సందర్శకులతో కిటకిటలాడింది. చర్చి ఆవరణ ఏసు నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జాతరకు తరలివచ్చిన ప్రజలతో దుకాణాలు, రంగులరాట్నాలు కిటకిటలాడాయి.

-మెదక్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆగస్టు 2న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దీంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష నగదును ఆఫీసు కిటికీలో నుంచి బయటకు విసిరివేశారు. ఆ డబ్బును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆరోజు రిస్టర్ అయిన 56 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొని విచారణ జరిపారు. కానీ, అధికారులెవ్వరూ పట్టుబడకపోవడం గమనార్హం. అలాగే సిద్దిపేట ఆర్టీవో కార్యాలయంలో, సిద్దిపేటలోని బీసీవెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.



సంగారెడ్డిలోని సెంట్రల్ క్రైం స్టేషన్‌లో సీఐగా పనిచేసిన కిషోర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయినా వసూలు చేయడం మాత్రం మానుకోలేదు. అమీన్‌పూర్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించిన భూ పత్రాలు ఇవ్వడం కోసం రూ.కోటిన్నర డిమాండ్ చేశాడు. సదరు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఏసీబీ అధికారులు రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారు.



ప్రభుత్వ శాఖల్లో లంచావతారాలు..

- రాజ్యమేలుతోన్న అవినీతి
- చేయి తడపనిదే పని జరగదు
- పలు కార్యాలయాల్లో ఇదే తీరు
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఏసీబీ వలకు చిక్కిన 11 మంది ఉద్యోగులు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగితో పనిచేయించుకోవడం మన హక్కు, దాన్ని లంచంతో కొనొద్దు... ఇది ఓ సినిమాలోని డైలాగ్. కానీ ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా 'మామూళ్లు' లేనిదే పనులు జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బర్త్ సర్టిఫికేట్ నుంచి డెత్ సర్టిఫికేట్ వరకు.. కరెంట్ మీటరు నుంచి నల్లా కనెక్షన్ వరకు.. ఏ పనికైనా లంచం ఇవ్వాల్సిందే. ప్రతీ శాఖలోనూ అవినీతి ఉన్నా... రెవెన్యూ, సర్వే లాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీ కార్యాలయం, ట్రాన్స్‌కో, రిజిస్ట్రేషన్లు తదితర శాఖల్లో భారీగా అవినీతి జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఆయా శాఖల్లో లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న ఉద్యోగులే ఇందుకు ఆధారంగా నిలుస్తున్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులకు కాసులు ముట్టజెప్పి తమ పని సాఫీగా చేయించుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. అవినీతిని అరికట్టి శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు శాఖలో కూడా కొందరు లంచాలకు అలవాటు పడి మొత్తం శాఖకే మచ్చ తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారు.

కొన్ని శాఖల్లో అయితే అధికారులు రోజువారీగా టార్గెట్‌గా పెట్టుకొని వసూలు చేస్తున్నారు. కొందరు అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటుండగా.. మరికొంత మంది లంచం ఇవ్వలేక ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. కానీ, ప్రస్తుతం ఏసీబీ భయం కూడా లేకుండా కొందరు చెలరేగిపోతున్నారు. దొరికితేనే దొంగ.. లేదంటే దొర అన్నట్టుగా తెగిస్తున్నారు.

నెలకో లంచావతారం..

సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న 11 మంది ఉద్యోగులు అవినీతి నిరోదక శాఖ అధికారులకు చిక్కారు. ఇందులో ఎక్కువ రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసుశాఖలో పని చేస్తున్నవారే ఉన్నారు.

- జనవరిలో సదాశివపేట మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.వెంకట్‌రావు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వై.వేణుగోపాల్ శర్మ రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.
- మార్చిలో మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ బానోత్ సురేందర్ రూ.4వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- మే నెలలో నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారి బి.అనిల్‌కుమార్ రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వరకు చిక్కారు.
- జూన్‌లో న్యాల్‌కల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంగం దుర్గయ్య రూ. 70వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- జూలైలో మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.ఆనంద్ గౌడ్, మరో వ్యక్తి మహ్మద్‌మస్తాన్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కారు.
- ఆగస్టులో సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చాకలి అరుణ్ కుమార్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ మన్నె సంతోష్ కుమార్ రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.
- సెప్టెంబరులో సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న మహ్మద్ షకీల్ రూ.5వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు.
- డిసెంబరు నెలలో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మహదేవుపల్లి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ఉమేష్‌కుమార్ రూ.15 వేలు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. నారాయణఖేడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవో పాటిల్ జగన్నాథ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు జూన్‌లో కేసు నమోదు చేశారు. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన పున్నూరు సచిన్‌కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో నవంబరులో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అవినీతి నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

ప్రభుత్వ ఉద్యోగితో పనిచేయించుకోవడం ప్రజల హక్కు అని తెలుసుకోవాలి. ప్రభుత్వ శాఖల్లో కానీ, సంస్థల్లో కానీ అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. అవినీతి రహిత సమాజం కోసం అటు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజల్లో చైతన్యం వస్తేనే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుంది. అవినీతి నిర్మూలన కోసం జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో పోస్టర్లు వేయించాం. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ఏసీబీని సంప్రదించాలి. అవినీతిపై 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. ఆదాయానికి మించి ఆస్తులున్నా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసినవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

-సుదర్శన్, ఏసీబీ డీఎస్పీ

విద్యుదాఘాతంతో

ఇద్దరు యువకుల దుర్మరణం

- పొలానికి నీరు పెట్టి వస్తుండగా ఫ్లెక్సీ కట్టిన ఇనుప రాడ్ తగిలి షాక్
- మెదక్ జిల్లా కిష్టాపూర్‌లో అర్ధరాత్రి ఘటన
- ప్రమాదానికి సర్కారుదే బాధ్యత.. రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ నేతల డిమాండ్

7

ప్రాణాలు తీసిన ప్రమాదాలు

వేర్వేరు చోట్ల నలుగురు మృతి

7



వార్షిక నేర సమీక్షా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ

జిల్లాలో 63 సైబర్ కేసులు

- గతంతో పోలిస్తే పెరిగిన దొంగతనాలు
- అతివలపై కొనసాగుతున్న అఘాయిత్యాలు
- ఉత్తమ సేవలకు ప్రశంసలు, రివార్డులు

మెదక్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు.. రోడ్డు ప్రమాదాలు.. సైబర్ మోసాలు.. అత్యాచారాలు.. అదృశాలు.. ఇలా మెదక్ జిల్లాలో కేసులు పెరగడం ఆందోళన కల్గిస్తోంది. జిల్లాలో గతేడాది 4,187 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 4,871 కేసులు నమోదయ్యాయి. వార్షిక నేర నివేదికను గురువారం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెగిరిన హత్యలు.. దొంగతనాలు

2024లో హత్యలు పెరిగాయి. హత్యల కేసులు 28 నమోదు కాగా ఆస్తి కోసం 48 జరిగాయి. అపహరణలు 41, అత్యాచారాలు 48 నమోదయ్యాయి. మహిళలపై వివిధ రకాల నేరాలు 355 జరిగాయి. జిల్లాలో సైబర్ నేరాలు పెరిగాయి. ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేయడం, స్కీంలు, చీటీల పేరిట చీటింగ్ చేసి లక్షల రూపాయలను ఎగొట్టడం లాంటి కేసులు ఈసారి ఎక్కువగా నమోదయ్యాయి. 63 సైబర్‌క్రైం కేసులు నమోదు కాగా.. దాదాపు రూ. 2.88 కోట్లు ప్రజల నుంచి కాజేశారు. అందులో రూ.30.80 లక్షలను పోలీసులు బాధితులకు అందజేశారు. కేసులను ఛేదించారు. దీంతోపాటు ఈ యేడు దొంగతనాలు పెరిగాయి. గత సంవత్సరం 102 దొంగతనాలు నమోదు కాగా.. ఈఏడాది 179 దొంగతనాలు జరిగాయి. దొంగతనాలతో ఈ యేడు రూ.3,36, 54, 826 సొత్తును దోసుకెళ్లారు. ఇందులో రూ. 1,22,57,329 నగదును రికవరీ చేశారు. అత్యాధునిక టెక్నాలజీని పోలీస్ శాఖ వినియోగించుకుంటూ.. సీసీ కెమెరాల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోనూ ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. దొంగతనాల కేసులను ఛేదించడంలో పోలీసులకు సీసీకెమెరాలు ఎంతగానో ఉపయోగపడినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతాం

-ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గతేడాది కంటే నేరాలు పెరిగినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధనలో విజయవంతమయ్యాం. వచ్చే సంవత్సరం రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయిపై ఉక్కుపాదం, మహిళల భద్రతే లక్ష్యంగా ముందుకువెళ్తాం. దొంగతనాలు, సైబర్ నేరాలపై దృష్టి సారిస్తాం. సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీసుల్లో నైపుణ్యం పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాకు కొత్త కానిస్టేబుళ్లు వచ్చారు. ఘటన జరిగినా నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకుంటారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతాం.



అమీన్‌పూర్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్లు

డబుల్.. ట్రబుల్..!

- ఇళ్లు ఇచ్చినా.. చేతికందని పట్టా
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- సంగారెడ్డి ఆర్డీవో బీరువాలో మూలుగుతున్న పట్టాలు
- మరోవైపు ఇళ్లల్లో చేరాలని హెచ్చరికలు..
- ఈ నెల 31 వరకు డెడ్‌లైన్

7

డిఫాల్టర్లకూ సీఎంఆర్

- 46 రైస్ మిల్లులకు 1.25 లక్షల టన్నులు కేటాయింపు
- 25 శాతం పెనాల్టీ చెల్లించిన మిల్లర్లకే అంటున్న అధికారులు
- ఇంకా చెల్లించాల్సిన బకాయి రూ. 15 కోట్లు
- బకాయి చెల్లించని మిల్లులపై కొనసాగుతున్న కేసులు



మెదక్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లకు ధాన్యం విషయంలో ఈసారి డిఫాల్ట్ మిల్లులకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఖరీఫ్ ధాన్యం కేటాయింపులో ప్రభుత్వం నిబంధనలు సడలించడం మిల్లర్లకు ఊరటనిచ్చింది. తమకు కేటాయించిన ధాన్యాన్ని మరాడించి ఇవ్వని రైస్ మిల్లులపై 25 శాతం అపరాధ రుసుము విధించింది. ఆ తర్వాత పౌర సరఫరాలశాఖతో చేసుకున్న ఒప్పందం మేరకు 100 శాతం సీఎంఆర్ ఇచ్చినప్పటికీ 25 శాతం జరిమానా చెల్లించని మిల్లర్లకు సీఎంఆర్ కేటాయింపులను నిలిపివేశారు. ప్రస్తుతం ఆ పెనాల్టీలో 25 శాతం చెల్లించిన మిల్లర్లకు ఈ సీజన్‌లో కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ చౌహాన్ 57 నెంబరు జీవో జారీ చేయడంతో జిల్లాలో మిల్లర్లకు కాస్త ఊరట లభించింది. అయితే, డిఫాల్ట్ మిల్లర్లు 25 శాతం బ్యాంకు పూచీకత్తు తీసుకునే సీఎంఆర్ కేటాయిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ తెలిపారు.

రూ.240 కోట్ల బకాయిలు

పౌర సరఫరాలశాఖ అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎఫ్‌సీఐకి ధాన్యానికి బదులుగా బియ్యం మరాడించి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ ధాన్యాన్ని పక్కదారి పట్టించి కోట్లు సొమ్ము చేసుకున్నారు. మెదక్ జిల్లాలోనే ఇప్పటి దాకా బియ్యం బకాయిలు రూ.240 కోట్ల వరకు ఉంది. గ్యారెంటీ లేక పోవడంతో ప్రభుత్వ ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలుతోంది. ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రెవెన్యూ రీకవరీ యాక్టు కింద ఆస్తులు జప్తు చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 13 రైస్‌మిల్లుల యజమానులు సుమారు రూ.240 కోట్లు బకాయి ఉన్నారు. ఈ రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కేటాయించలేదు.

రూ.3.50 కోట్లు చెల్లింపు

గతంలో కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు లోగా సీఎంఆర్ ఇవ్వక పోవడంతో వారిపై 25 శాతం అపరాధ రుసుము విధించారు. ఆ తర్వాత ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చినా అపరాధ రుసుము చెల్లించనివారికి సీఎంఆర్ కేటాయింపులు నిలిపివేశారు. గత నెల రాష్ట్ర సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్ జిల్లా పర్యటన సందర్భంగా పలువురు డీఫాల్ట్ మిల్లర్లు తాము వందశాతం బియ్యం ఇచ్చినందున ఈ సీజన్‌లో సీఎంఆర్ కోటా కేటాయించాలని కోరారు. దీంతో కమిషనర్ మిల్లర్లకు అవకాశం కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేస్తూనే 25 శాతం అపరాధ రుసుములో ప్రస్తుతం అందులో 25 శాతం ఫైన్ చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 46 రైస్ మిల్లర్లు రూ.15 కోట్లు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉండగా, అందులో 25 శాతం రూ.3.50 కోట్లు చెల్లించినట్లు సివిల్‌సప్లై అధికారులు తెలిపారు. వీరి నుంచి 25 శాతం బ్యాంకు పూచీకత్తు తీసుకుని ధాన్యం కేటాయిస్తున్నారు. సాధారణంగా మిల్లర్ల వద్ద 10 శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకుని సీఎంఆర్ ఇచ్చేవారు. కానీ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బియ్యం ఇవ్వడం లేదని 25 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ నెలాఖరు లోపు సీఎంఆర్ ఇవ్వాలని గడువు విధించింది. వచ్చే సంవత్సరం జనవరి 18 లోపు రూ.11.5 కోట్లు విలువ చేసే ధాన్యం లేదా నగదు చెల్లించాలని మిల్లర్లను ఆదేశించినట్లు సివిల్‌సప్లై డీఎం హరికృష్ణ తెలిపారు.





మరమ్మతులకు ముందు నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్‌లో పాఠశాల, గోడలపై రంగురంగుల బొమ్మలు వేసిన దృశ్యం

పాఠశాలకు ఉపాధ్యాయుల చేయూత

● శిథిలావస్థకు చేరిన పాఠశాలకు మరమ్మతులు ● సొంత నిధులతో మొరం, పెయింటింగ్ పనులు చేయించిన టీచర్లు

నాగల్‌గిద్ద, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంటే చదువు చెప్పడమే కాదు.. తాము పనిచేస్తున్న పాఠశాలకు కూడా చేయూతనిస్తామని నిరూపిస్తున్నారు సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామంలోని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు. గ్రామంలోని పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు బాపుశెట్టి, ఉపాధ్యాయులు రమేష్, సంగమేశ్వర్, లింగమేశ్వర్ కలిసి పాఠశాల అభివృద్ధి కోసం రూ.70 వేల సొంత డబ్బులు ఖర్చుచేసి పాఠశాల ఆవరణలో భూమిని చదును చేయించి, మొరంను వేయించారు. అలాగే పాఠశాలలోని గోడలకు రకరకాల బొమ్మలతో పెయింటింగ్స్ వేయించి, పాఠశాల రూపురేఖలనే మార్చేశారు. అంతేకాకుండా దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను పంపిణీ చేయించారు. ఉపాధ్యాయులు చేస్తున్న పనికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాజీ డీఎస్పీ నళిని రచించిన వేదజ్ఞానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలోని నిగమ-నీడమ్ వేద గురుకుల పాఠశాలలో మాజీ డీఎస్పీ నళిని సనాతన ధర్మంపై రచించిన వేదజ్ఞానం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద గురుకులాలు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్నాయని, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మాజీ డీఎస్పీ నళిని దేశం కోసం, ధర్మం కోసం కృషి చేస్తున్నారని, ఆమె త్యాగం గొప్పదన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు వెంకటరమణ, కుడిక్యాల రాములు, ఎల్కంటి సురేశ్, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్, ఐలయ్యయాదవ్, సంపత్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింహముదిరాజ్, అరవింద్, ప్రభాకర్, భీమ్‌కుమార్, మహేందర్, సత్యం, గణపతి, సాయి, కుర్ర స్వామి తదితరులున్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న ప్రతినిధులు

జపాన్ బృందంతో ఐఐటీహెచ్ ఒప్పందం

కంది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, మానవవనరులు, జీవన విధానం, విద్యా మార్పిడి కోసం కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్- జపాన్ దేశంలోని హమామట్సు సిటీ మేయర్‌తో ఒప్పందం చేసుకున్నారు. గురువారం జపాన్ ప్రతినిధుల బృందం ఐఐటీహెచ్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఇరువర్గాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా హమామట్సు సిటీ మేయర్ యాసుకే నకనో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

● సంగారెడ్డి జిల్లా షీటీం హెడ్ ముంతాజ్



అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముంతాజ్

జహీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా షీటీం హెడ్ ముంతాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాములు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అల్గోల్ తదితర ప్రాంతాల్లో షీటీం బృందం సభ్యులు పర్యటించారు. అనంతరం అల్గోల్‌లో గల గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సైబర్‌క్రైం ప్రభావంతో ఎందరో నష్టపోతున్నారని గుర్తుచేశారు.మొబైల్‌కు వచ్చే అనుమానిత లింక్‌లు క్లిక్ చేయొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో షీటీంబృందం సభ్యులు భరత్‌గౌడ్, దిలీప్, సాయిభరత్, సాయినాథ్, హరినేత్ర, మహేశ్, విజయ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో గోమాతకు సీమంతం



తూప్రాన్‌లో గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లో గోమాతకు గురువారం శ్రీమంతం చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నివాసముండే ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రసాద్ కొన్నినెలల క్రితం ఆవును తీసుకొచ్చి పెంచుకుంటున్నాడు. ఇంటికి గోమాత రావడంతో అన్నీ శుభాలు జరుగుతుండటంతో ఇంట్లో సభ్యుడిగా పెంపకం చేపట్టారు. గోమాత ఐదునెలల గర్భం దాల్చడంతో గురువారం గోమాతకు పూలమాలవేసి పూజలు నిర్వహించారు. చీర సారె సమర్పించి శ్రీమంతం చేశారు. శ్రీమంతానికి స్నేహితులను ఆహ్వానించారు. గోమాతను రక్షించాలని శ్రీమంతం నిర్వహించినట్లు ప్రసాద్ వివరించారు.

వీఆర్‌వో వ్యవస్థ పునరుద్ధరణ ప్రకటనపై హర్షం



సంగారెడ్డిలోని ఐబీలో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్న పూర్వ వీఆర్‌వోలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పూర్వ వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీఎల్‌వో పేరుతో పోస్టులు భర్తీ చేసేందుకు నిర్ణయించినందుకు పూర్వ వీఆర్‌వోలు హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిక్రూట్‌మెంట్ ద్వారా కాకుండా అర్హులైన వీఆర్‌వో, వీఆర్‌ఏలను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికోసం డిగ్రీ, ఇంటర్‌లోపు చదివిన వారు ఎవరైనా ఆసక్తి గల వారు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటయ్య, హుస్సేన్, వెంకన్న, శంకరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో చిరుజల్లులు

రామాయంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో గురువారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఈ ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఊహించని విధంగా చిరుజల్లులు కురవడంతో జనం బయటకు రాలేకపోయారు. చలికాలంలో వర్షాలు కురవడం ఏంటని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎలాంటి పంటలు విత్తకపోవడంతో పంటలకు ఇబ్బందులు ఏర్పడలేదు.

నేడు విద్యుత్ నిలిపివేత

మునిపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, పెద్దలోడి, చిన్నలోడి, చీలపల్లి, కల్లపల్లి బేలూర్, మక్తక్యాసారం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగించే చెట్లను నరికివేస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

డబుల్.. ట్రబుల్..!

ఇళ్లు ఇచ్చినా.. చేతికందని పట్టా

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- సంగారెడ్డి ఆర్డీవో బీరువాలో మూలుగుతున్న పట్టాలు
- మరో వైపు ఇళ్లలో చేరాలని హెచ్చరికలు..
- ఈ నెల 31 వరకు డెడ్‌లైన్



కొల్లూరు డబుల్‌బెడ్‌రూం మెగా టౌన్‌షిప్

పటాన్‌చెరు, డిసెంబరు, 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ ఇండ్లు అందని ద్రాక్షగా మారుతున్నాయి. ఇళ్లు కేటాయించినా.. పట్టాలు చేతికి అందకపోవడంతో లబ్ధిదారులు వాటిని సొంతం చేసుకోలేకపోతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొల్లూరులో ఇళ్లు లేని పేదల కోసం సుమారు 28 వేల ఇళ్లను పటాన్‌చెరు నియోజకవర్గపరిధిలో రింగ్ రోడ్డుకు లోపల నిర్మించారు. ఇక్కడ సుమారు 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, 60 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లలో చేరారు. అమీన్‌పూర్‌లో 1836 మంది లబ్ధిదారులకు 15 వందల మంది మాత్రమే ఫ్లాట్లలో ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి పట్టాలను పంపిణీ చేశారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలోని.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులూ ఉన్నారు. లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు మాత్రం చేతికి అందలేదు. దీంతో ఏడాదిగా వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, మిగిలిన ఫ్లాట్లలో లబ్ధిదారులు చేరేందుకు తొలుత ఈ నెల 5న డెడ్‌లైన్‌గా పెట్టారు. తర్వాత దానికి ఈ నెల 31 వరకు పొడగించారు. అయితే, లబ్ధిదారుల్లో చాలామందికి ఇంకా పట్టాలు చేతికి అందకపోవడంతో తాము ఇళ్లలో చేరాలో వద్దో తెల్చుకోలేకపోతున్నారు. లబ్ధిదారులుగా ఎంపిక చేసినా.. పట్టాలు లేకపోవడంతో వారి పరిస్థితి దిక్కుతోచకుంది.

కొంతమందికే పట్టాలు..

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ వ్యవహారం అంతా హడావిడిగా సాగింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు లబ్ధిదారులను ఆఘమేఘాల మీద ఎంపిక చేశారు. అప్పటి ప్రజా ప్రతినిధులు సమావేశాలు పెట్టి కొంత మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. మిగిలిన వారికి కార్యాలయాల్లో అందజేస్తామని చెప్పారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పట్టాలు ఎక్కడ ఉన్నాయో.. ఎవరికి అడగాలో తెలియని అయోమయంలో లబ్ధిదారులు పడిపోయారు. అయితే, లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు పట్టాలు తీసుకెళ్లాలనే సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నా.. చాలా మంది లబ్ధిదారుల వద్ద దరఖాస్తు చేసుకున్న నాటి సెల్ ఫోన్లు లేకపోవడం, కరోనా.. ఇతర పరిస్థితుల కారణంగా పలువురు స్వగ్రామాలకు వెళ్లడంతో వారికి సమాచారం అందక పట్టాల పంపిణీ కార్యక్రమానికి రాలేదు. ఇదే వారికి శాపంగా మారింది.

సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో..

వందలాది మంది లబ్ధిదారులకు సంబంధించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు ఇప్పుడు సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయి. తొలుత తహసీల్దార్ల ఆధీనంలో ఉన్న పట్టాలను తర్వాత ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. అయితే, లబ్ధిదారులు తహసీల్ కార్యాలయాల్లో సంప్రదిస్తే సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. జాబితాలో పేరు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు చూసి తమకు ఆక్యుపెన్సీ ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నా.. పట్టాలు తేస్తే తప్ప సర్టిఫికెట్ ఇవ్వలేమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కల్పించుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే, ఇటీవల ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను కలిసి కేటాయించకుండా మిగిలిపోయిన ఇళ్లను నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే చేయూతనివ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాలో పేర్లు ఉన్న వారి పట్టాలు తమ వద్దే ఉన్నాయి. వారికి పట్టాలను అంజేయాలంటే ప్రభుతం నుంచి తమకు ఆదేశాలు జారీ కావాలి. అనివార్య కారణాల వల్ల పట్టాలను తీసుకోని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తాం.

- రవీందర్, ఆర్డీవో, సంగారెడ్డి

ఇక్కడ 'డబుల్' తిప్పలు

వెల్దుర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి కాకుండానే ఇళ్లను కేటాయించడంతో వాటిలో ఉండలేకపోతు న్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తికి 100 డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు కాగా, ఒక చోట సింగిల్‌గా 36 ఇళ్లు, మరోచోట జీ ప్లస్ వన్‌లో ఎనిమిది బ్లాక్‌లను నిర్మించారు. అందులో ఒక బ్లాక్‌కు సంబంధించి డోర్‌లు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదు. అలాగే ఎనిమిది బ్లాక్‌లకు సంబంధించి డ్రైనేజ్ వ్యవస్థ విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం జిల్లా అదనపు కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినా.. ఎలాంటి స్పందన లేకుండా పోయింది.



డ్రైనేజీ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకుండానే వదిలేసిన దృశ్యం

కరెంట్.. డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వలే..



డబుల్ బెడ్ రూం ఇళ్లకు విద్యుత్ సదుపాయం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో లబ్ధిదారులు కాళ్లరిగేలా తిరగడంతో చివరికి అధికారులు మీటర్లు ఏర్పాటు చేసినా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ఇక జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మించిన ఇళ్లకు డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఇండ్ల నుంచి బయట వరకు పైప్‌లైన్‌లను వేసి సంపు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో డ్రైనేజీ పైప్‌లలో మురుగు నిండి దుర్గంధం రావడమే కాకుండా మురుగు నీరు పోకపోవడంతో పైప్‌లైన్‌లు నిండిపోతున్నాయి. మొత్తం వంద డబుల్ ఇండ్లకు ప్రత్యేకంగా ట్యాంకును నిర్మించి కనెక్షన్‌లను ఇచ్చారు. ఈ ట్యాంకుకు మిషన్ భగీరథ కనెక్షన్ మాత్రమే ఉండడంతో భగీరథ నీరు సరఫరా అయిన రోజు మాత్రమే అరకొరగా నీరు వస్తుంది.

బోరుబావికి నిధులు మంజూరు...

డబుల్ ఇడ్లలో తాగునీటి కోసం బోరు బావితో పాటు ట్యాంకు కనెక్షన్ కోసం రూ. 2.50 లక్షల మంజూరు అయ్యాయి. కానీ, బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ఎవరు ముందు రాకపోవడంతో పని జరగడం లేదు. త్వరలోనే బోరుబావి తవ్వించి తాగునీటి సమస్య తీరుస్తాం.

- శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఏఈ..

కేసీఆర్‌ను కలిసిన డీసీసీబీ మాజీ డైరెక్టర్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బట్టు అంజిరెడ్డి కుటుంబసభ్యులు

మర్కుక్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. అంజిరెడ్డి కుమార్తె సహస్ర పుట్టిన రోజు సందర్భంగా అంజిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అంజిరెడ్డి పదేళ్లుగా కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని చూసుకుంటున్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదంటూ నిరసన



రేగోడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మర్పల్లి రైతులు

రేగోడు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గురువారం మెదక్ జిల్లా రేగోడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మర్పల్లి రైతులు ఆందోళన చేశారు. ఓ దశలో సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించారు. సబ్ స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సబ్‌స్టేషన్ ఆఫీస్ భవనం ఎక్కిన రైతులు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే వరకు దిగేది లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఐదు రోజులవుతున్నా.. లైన్‌మన్ పట్టించుకోవడం లేదని, బోర్ల కింద వేసిన ఉల్లి, జొన్న, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రేగోడు ఏఎస్‌ఐ మల్లయ్య సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ ఏఈ వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడుతామని చెప్పారు. దీంతో రైతులు దిగి వచ్చి లైన్‌మన్‌పై ఫిర్యాదు చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మారుస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళన దాదాపు రెండు గంటల పాటు సాగింది.

ప్రజారోగ్యం, పరిశోధనా రంగాల్లో అపార అవకాశాలు

ఎమోరీ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సింగ్లా



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్ సింగ్లా

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, పరిశోధనా రంగాలలో ఫార్మసీ విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా అపార అవకాశాలు ఉన్నాయని అమెరికాలోని ఎమోరీ విశ్వవిద్యాలయ భారతీయ పరిశోధనా, విద్యా ఆవిష్కరణల డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సింగ్లా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీని ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో డాక్టర్ నిఖిల్ మాట్లాడారు. విద్యార్థుల పరిధిని విస్తృతం చేసేందుకు, వారి విద్యా, వృత్తిపరమైన విషయాలలో అంతర్జాతీయ అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఎమోరీ విశ్వవిద్యాలయంతో సహకారంతో ఉమ్మడి పరిశోధనా కార్యక్రమాలు చేపట్టే వీలుందని ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమోరీ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐవోన్ ఫోసీ, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివకుమార్, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, ఫార్మసీ అధ్యాపకులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 244 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన అత్యాపాత్య జట్టు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడల్లో జిల్లా నుంచి 244 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కిక్‌బాక్సింగ్, హాకీ, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, అత్యాపాత్య, వుష, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ జట్లు రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రాంతాల్లో జరిగే ఎంపికల్లో తలపడనున్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్లను జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసింబేగ్ దగ్గరుండి రాష్ట్ర స్థాయికి పంపి అభినందించారు.

సీఎస్‌ఐకి భక్తుల బారులు

రెండోరోజూ తగ్గని రద్దీ



చర్చి ప్రధాన ద్వారం వద్ద జనం

మెదక్ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ సీఎస్‌ఐ చర్చిలో క్రిస్మస్ రెండో రోజూ భక్తులు కిటకిటలాడారు. దీంతో చర్చి ఆవరణ మొత్తం ఏసు నామస్మరణతో మారుమోగింది. ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. భక్తులకు మతగురువుకు ఆశీర్వచనాలు అందజేశారు. శిలువ వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ, తలనీలాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలు చేస్తూ రోజంతా సరదాగా గడిపారు. మెదక్ డీసీసీ ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సాంసన్ సందీప్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వ్యాపారులపాలిట కన్నీటి చినుకులు

మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఏసు జాతర సందర్భంగా చర్చి ఆవరణలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ రోజు అంతంత మాత్రంగానే వ్యాపారం జరగగా, రెండో రోజు బాగుంటుందని వ్యాపారులు ఆశించారు. కానీ, సాయంత్రం వర్షం కురవడంతో జనం తగ్గిపోయారు. ఏటా లక్షల్లో వ్యాపారం జరిగేదని, ఈసారి వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి దస్తగిరి ఖాన్ పేర్కొన్నారు. వర్షం వల్ల వ్యాపారం తగ్గిపోయిందన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో దోషికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి గురువారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన అయ్యవారి రజనీకాంత్ (30) అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై 2019 సెప్టెంబరు 9న అత్యాచారానికి పాల్పడ్డాడు. పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితునికి 20 సంవత్సరాల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వలస కూలీ అదృశ్యం

రామచంద్రాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ కూలీ అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర గోంద్యాకు చెందిన సోమమంగళ గాత్రే(40) తెల్లాపూర్ లోని అతూల్య హోమ్స్‌లో ఈ నెల 16న కూలీగా చేరాడు. 20న బయటకు వెళ్లిన గాత్రే తిరిగి రాలేదు. అతని గ్రామానికి చెందిన మోహన్ అనే కూలీ గాత్రే పలు చోట్ల వెతికి, స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించాడు. బుధవారం వరకు అతను స్వగ్రామానికి వెళ్లలేదని తెలుసుకుని కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగలో పేకాట ఆడుతున్న నలుగురిని త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామంలోని దుర్గా సాయి తన షాప్‌లో అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుతూ లిక్కర్ అమ్మడంతోపాటు పేకాట ఆడుతుండడంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న సాయి, కిష్టయ్య, మహేష్, కనకయ్య అనే నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,230 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నడుపుతున్నందున అందులోని 11.62 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కారులో రూ. 10 లక్షలు చోరీ

పట్టించిన సీసీ కెమెరాలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

మునిపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి బుదేరా చౌరస్తాలోని తాజ్ దాబా వద్ద ఈనెల 16న ఓ కారులో ఉన్న రూ. 10లక్షలను దొంగలించిన దొంగలు సీసీ కెమెరాల ఆధారంగా దొరికారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, కొండాపూర్ సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్‌లు సర్కిల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ వాజిద్ ఈ నెల 16న కర్ణాటకకు కారులో వెళ్తూ మండలంలోని బుదేరా చౌరస్తాలోని తాజ్ దాబా వద్ద భోజనం చేసేందుకు ఆగారు. ఆయన దాబాలోకి వెళ్లగా, కారులో ఉన్న రూ. 10 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు మునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్, ఎస్ఐ రాజేశ్‌నాయక్‌లు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అలీ ఖురేషి, అబ్దుల్ వహీద్, మహ్మద్ రహీం ఖాన్‌లు కారులో నుంచి డబ్బు తీసినట్లు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని రిమాండ్ తరలించి, వారి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును బాధితుడికి అందించారు. చోరీ కేసును ఛేదించిన మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ సత్తయ్య గౌడ్ అభినందించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల దుర్మరణం

- పొలానికి నీరు పెట్టి వస్తుండగా ఫ్లెక్సీ కట్టిన ఇనుప రాడ్ తగిలి షాక్
- మెదక్ జిల్లా కిష్టాపూర్‌లో అర్ధరాత్రి ఘటన
- ప్రమాదానికి సర్కారుదే బాధ్యత.. రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి: బీఆర్ఎస్ నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



నవీన్, ప్రశాంత్ (ఫైల్)

కొల్చారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అక్కెం నవీన్‌యాదవ్ (22), పసుల ప్రశాంత్ యాదవ్ (23) చిన్నప్పటి నుంచి స్నేహితులు.. బుధవారం రాత్రి నారు మడికి నీరు పెట్టేందుకు ఇద్దరు కలిసి వెళ్లారు. పని అయిపోగానే తిరిగి ఇళ్లకు బయలుదేరారు. అయితే మార్గ మధ్యలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఫ్లెక్సీ కట్టిన రాడ్ ఉండటం.. దానికి కరెంట్ సరఫరా జరుగుతుండటం వారు గమనించలేదు. అయితే నవీన్ అనుకోకుండా ఆ రాడ్‌ను తగలడంతో విద్యుత్తు షాక్ తగిలింది. స్నేహితుడిని కాపాడేందుకు ప్రశాంత్ యాదవ్ యత్నించగా.. ఇద్దరు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళ్తున్న గ్రామస్థులు విషయం గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై మహమ్మద్ గౌస్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు యువకులు ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రశాంత్ వివాహం వచ్చే నెలలోనే జరగాల్సి ఉంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మెదక్ ఏరియా ఆస్పత్రికి వచ్చి బాధితులను ఓదార్చారు. అంత్యక్రియల కోసం రెండు కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

కాంగ్రెస్ సర్కారుదే బాధ్యత: బీఆర్ఎస్

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా విద్యుత్తు వైర్ల కింద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగానే షాక్ తగిలి నవీన్, ప్రశాంత్‌లు మృతి చెందారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆరోపించారు. కిష్టాపూర్‌లో మృతుల కుటుంబాలను వారు పరామర్శించారు. యువకుల మృతికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. సీఎం స్పందించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రాణాలు తీసిన ప్రమాదాలు

వేర్వేరు చోట్ల నలుగురు మృతి

కొండపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఇందులో కొన్ని ప్రమాదాలకు అతివేగమే కారణమని తెలుస్తోంది.

కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం మంగళగిరి గ్రామానికి చెందిన పలువురు వెల్మ సింధుజ(30), ఐట్ల లక్ష్మి, ఐట్ల సమీక్ష, దూస రమ, ఎలిగేటి మల్లేశం, నీరజ,షైని, మచ్చ నరేష్‌లు తవేరా జీపులో ఈనెల 24న రంగారెడ్డి జిల్లా అస్మాన్‌పల్లి గ్రామంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వెళ్లారు. 25న రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో కొండపాక శివారులో వారి వాహనాన్ని గుర్తు తెలియని డీసీఎం వ్యాన్ ఓవర్ టేక్ చేసే క్రమంలో బలంగా ఢీ కొట్టింది. దీంతో జీపులో ఉన్న సింధుజ, మల్లేశం, నరేష్, శివానీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సింధుజ మృతి చెందింది. నరేష్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. సింధుజ భర్త సతీష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. వ్యక్తి మృతి



వర్గల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం గౌరారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గురువారం మృతి చెందాడు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల మెరకు ములుగు మండల కేంద్రానికి చెందిన ధోరణాల శ్రీకాంత్ (36) బుధవారం మధ్యాహ్నం తన ఆటోలో గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో జరిగిన బంధువుల దశ దినకర్మకి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రాత్రి గౌరారం సమీపంలోని మూల మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను లక్ష్మక్కపల్లిఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు.

కుక్కను తప్పించబోయి..

తూప్రాన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న కుక్కను తప్పించబోయి, ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. తూప్రాన్ మండలంలోని నాగులపల్లి శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట మండలంలోని నడిమితాండకు చెందిన మాలోత్ మంజ్యా(70) గురువారం మధ్యాహ్నం తన మోపెడ్‌పై తూప్రాన్‌కు బయలు దేరాడు. నాగులపల్లి శివారులోని కాఫీ డే వద్ద యూటర్న్ చేస్తుండగా అడ్డు వస్తున్న కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడమృతి చెందాడు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొన్ని ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ప్రజ్ఞాపూర్‌లోని ఔటర్ రింగురోడ్డుపై చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన మందుల ప్రదీప్ టాటాఏస్ ట్రాలీ వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో 8 మంది పిల్లలతో కలిసి కుకునూరుపల్లి మండల మేధినీపూర్ గ్రామంలోని చర్చిలో జరిగిన క్రిస్‌మస్ వేడుకలకు బుధవారం హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ప్రజ్ఞాపూర్ ఔటర్ రింగ్‌రోడ్డుపై బాబాయ్ హోటల్ ముందు టీ తాగేందుకు వాహనాన్ని నిలిపారు. వాహనంలోని వారంతా హోటల్‌లోకి వెళ్లగా డ్రైవర్‌తోపాటు ప్రదీప్‌లు అందులోనే ఉండిపోయారు. ఇదే సమయంలో అక్కన్నపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన శివగణేష్ రెడ్డి టాటాఏస్ వాహనంలో మిత్రుడైన సాయికుమార్‌రెడ్డిని వెంటబెట్టుకొని హుస్నాబాద్‌లో కోడిపిల్లలను నింపుకొని బీదర్ వెళ్లేందుకు బయలుదేరారు. ప్రజ్ఞాపూర్‌లోని ఔటర్‌రింగ్‌రోడ్డుపై బాబాయ్ హోటల్ ముందు ఆగి ఉన్న టాటాఏస్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టాడు. దీంతో వాహనం రోడ్డుపై దూసుకు వెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివగణేష్‌రెడ్డి స్నేహితుడు సాయికుమార్‌రెడ్డి(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

న్యూస్ బాక్స్

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

జిన్నారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో పారిశుధ్య సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. స్థానికంగా పలు కాలనీల్లో మురుగు కాలువలు రహదారుల పైనుంచే ప్రవహిస్తున్నాయని, ఈ విషయమై ఫిర్యాదు చేసినా, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి అన్నారు. ముఖ్యంగా కార్మికులు అత్యధికంగా నివాసం ఉండే ప్రాంతాల్లో మురుగు కాలువలు ప్రవహిస్తున్నాయని, వెంటనే వాటిపై శ్రద్ధ వహించి, సమస్యలు నివారించాలని ఆయన కోరారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

జిన్నారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జంగంపేటలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

మనుస్మృతి పత్రాలు దహనం

హత్నూర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుండ్లమాచనూర్ గ్రామంలో గురువారం ఆలిండియా సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రాజ్, అధ్యక్షుడు సాయమొల్ల రాజు, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ

రామాయంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్వహించనున్న ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. ప్రభుత్వ కళాశాల మైదానంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జనవరి 8 నుంచి 12 రోజుల పాటు ఆడే ఆటల్లో 32 మ్యాచ్‌లు ఉంటాయన్నారు. దీనిలో ఉమామహేశ్వర్, బసన్నపల్లి మల్లేష్, బాలు జొన్న ఉన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే ప్రక్రియ

మాసాయిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలోని పోతనపల్లి, చెట్లతిమ్మాయిపల్లి, బొమ్మారం, మాసాయిపేట, రామంతపూర్ తండా తదితర గ్రామాల్లో సర్వే కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

అవినీతిపై విచారణ జరపాలి

ధూళిమిట్ట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగాపూర్ ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం, గ్రామ మహిళా సంఘాలలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గద్దల మహేందర్ గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగాపూర్ గ్రామంలో ఐక్య సంఘం ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా అక్రమాలు, నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

గుమ్మడిదల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండురోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వారం క్రితం గుమ్మడిదల పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నలుగురు మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ముగ్గురికి రూ.4,500 జరిమానా, ఒకరికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

నర్సాపూర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో దూరి సీసీ కెమరాలు ధ్వంసం చేసి డబ్బులను తీయడానికి ప్రయత్నించారు. ఎంతకూ రాకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఏటీఎంలో డబ్బులు పోకపోవడంతో పోలీసులు, బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గొర్రె మృతి

చిలప్‌చెడ్ , డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గొర్రె మృతిచెందింది. జోగిపేట నుంచి నర్సాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ సమీపంలోకి రాగానే రోడ్డుపై గొర్రెను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే గొర్రె మృతిచెందిందని బాధితుడు పాతూరి యాదయ్య వాపోయాడు. ఈ విషయమై ప్రశ్నిస్తే తన పట్ల దురుసుగా ప్రవర్తించాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.




శిథిలమైన ఉర్దూ ఘర్-షాదీఖానా భవనం, సదాశివపేటలో నాలుగు ఎకరాల్లో ఉన్న ఈద్గా

షాదీఖానా ఆశలు ఆవిరి

- ఫైళ్లల్లోనే మూలుగుతున్న ప్రతిపాదనలు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా పాత భవనం
- మైనారిటీల కల నెరవేర్చాలని వేడుకోలు

సదాశివపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : షాదీఖానా ఆశలు శిథిలమయ్యాయి. 20 వేల మంది మైనారిటీ సోదరులు ఉన్నా ఒక్క షాదీఖానా కూడా పాలకులు కట్టించడం లేదు. ఎప్పుడో 30ఏళ్ల క్రితం (ఉర్దూఘర్) పేరిట కట్టిన చిన్నపాటి షాదీఖానా (భవనం) ఇప్పుడు శిథిలమై అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలో సర్వే నెంబరు 260లో 1995-1996 సంవత్సరంలో ఒక ఎకరం స్థలంలో ఓ మూలన అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ నిధులు రూ.7 లక్షలతో (ఉర్దూఘర్) పేరుతో ఓ చిన్నపాటి భవనం నిర్మించింది. ఆ భవనంలో ముస్లింలు షాదీఖానాను నిర్వహిస్తూ వచ్చారు. ఆ తరువాత 2009లో అప్పటి ఎమ్మెల్యే జగ్గారెడ్డి షాదీఖానా ఆవరణలో మరో 3 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఈద్గా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన (ఉర్దూఘర్-షాదీఖానా) కాల క్రమంలో శిథిలమైంది. రెండు దశాబ్దాలుగా శిథిమైన షాదీఖానాను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 2022లో కొత్త షాదీఖానా నిర్మాణానికి రూ.50 లక్షలతో ప్రణాళికలు, ప్రతిపాదనలు పంపారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, పట్టణాభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.25 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధుల్లో నుంచి షాదీఖానాను పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఆ నిధులను కాసా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో కొత్త షాదీఖానా నిర్మాణానికి పలుమార్లు చేసిన ప్రణాళికలు, ప్రతిపాదనలు ఫైళ్లల్లోనే మూలుగుతున్నాయి. ఇదిలా ఉండగా వచ్చే ఏడాది జనవరిలో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్నది. ఇప్పటికైనా బల్దియా పాలకవర్గం, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని కొత్త షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి మూడు దశాబ్దాల మైనార్టీల కలను నెరవేర్చాలని పట్టణంలోని ముస్లింలు కోరుతున్నారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం: ఎమ్మెల్యే



రుద్రారం పల్లె దవాఖానా భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో చేపట్టిన పల్లె దవాఖానా భవనం, మూడు ఆర్వో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రుద్రారం గ్రామ అభివృద్ధికి తోషిబా సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్‌రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముత్తంగి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, గడీల శ్రీకాంత్ గౌడ్, సిల్వరి శ్రీనివాస్, మేరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

కేవల్ కిషన్ త్యాగాలు మరువలేనివి



కేవల్ కిషన్‌కు నివాళులర్పిస్తున్న బండ ప్రకాశ్, నీలం మధుముదిరాజ్

చేగుంట/సంగారెడ్డి రూరల్/నర్సాపూర్/మెదక్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెత్తందారి వ్యవస్థకు ఎదురు నిలిచి, పేదల కోసం కేవల్ కిషన్ చేసిన త్యాగలు మరువలేనివని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. కేవల్ కిషన్ స్వగ్రామం చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో ప్రతీ ఏడు ఆయన త్యాగాలను గుర్తు చేసుకుంటూ కేవల్ కిషన్ సమాధి వద్ద బడుగు, బలహీనవర్గాలు జరుపుకునే జాతరలో పాల్గొని మాట్లాడారు. అలాగే సీపీఎం నాయకులు కూడా నివాళులర్పించాచు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, కేవల్ కిషన్ కుమార్తె డాక్టర్ వీణాకుమారి తదితరులు పాల్గొన్నారు. కేవల్ కిషన్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ తెలిపారు. కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని కేకే భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సాపూర్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.నాగరాజు ఆధ్వర్యంలో కేవల్ కిషన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మెదక్ పట్టణంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బండ నరేందర్ ఆధ్వర్యంలో కేవల్ కిషన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, నాయకులు కృష్ణ, నాగులు, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

ఏడుపాయల పుణ్యక్షేత్రమా... లేక పార్టీ కార్యాలయమా..?



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

మెదక్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏడుపాయల ఆలయాన్ని కాంగ్రెస్ జెండాలు, ఫ్లెక్సీలతో మార్చేశారని, అది పుణ్యక్షేత్రమా.. లేక పార్టీ కార్యాలయమా..? అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అధికారుల తీరుతో ఆలయ ప్రతిష్ట మంట కలిసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండాలు, ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన అధికారులతోపాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఎస్పీ బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా విద్యుత్ వైర్ల కింద కట్టిన ఫ్లెక్సీలను తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై నవీన్, ప్రశాంత్ మృతికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, రాజేందర్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు ఉపయోగం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు ఎంతో ఉపయోగమని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన అర్జున్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందాడు. అందుకు అయిన వైద్య ఖర్చులకు మంజూరైన రూ.58,500 సీఎం సహాయనిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ సర్పంచులు ఆంజనేయులు, కరుణాకర్, సామ్యానాయక్ పాల్గొన్నారు.

ట్రెసా నూతన కమిటీ ఎన్నిక



ట్రెసా సంగారెడ్డి డివిజన్ నూతన కమిటీ సభ్యులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మ రాములు ఉత్తర్వుల మేరకు సంగారెడ్డి డివిజన్ ఎన్నికలు బాకయ్య నేతృత్వంలో నిర్వహించి, కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వీరేశం, ప్రధాన కార్యదర్శిగా సంగ్రామ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా హరిశ్చంద్రప్రసాద్, కోశాధికారిగా మల్లికార్జున్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, కరణ్‌కుమార్, దశరథ్, బాలరాజ్, ఈశ్వర్, జావేద్ పాల్గొన్నారు.

ఏఎస్ఐలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన ఏఎస్ఐలతో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి లభించాయి. రేగోడ్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రాచప్ప, తూప్రాన్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమర్, జానీబాషాలకు ఏఎస్ఐలుగా పదోన్నతి దక్కింది. వీరు గురువారం మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పదోన్నతి పొందిన అధికారులు మరింత ఉత్సాహంగా పని చేయాలని సూచించారు.

అమిత్‌షా రాజీనామా చేసే వరకూ ఉద్యమం ఆగదు

- రాజ్యాంగ పరిరక్షణ కన్వీనర్ బీరయ్య యాదవ్



సంగారెడ్డిలో మనుస్మృతి పుస్తకాన్ని దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమిత్‌షా రాజీనామా చేసేవరకూ ఉద్యమం ఆగదని రాజ్యాంగ పరిరక్షణ కన్వీనర్ బీరయ్యయాదవ్ అన్నారు. సంగారెడ్డిలో గురువారం రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మనుస్మృతి పుస్తకాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా భేషరతుగా క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నాగయ్య, పల్లే సంజీవయ్య, సుదర్శన్, సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, లక్ష్మయ్య పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలో మాల మహానాడు, సమతా సైనిక్‌దళ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ ఎస్ఐ కాశీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ



లొంక హనుమాన్ ఆలయ ఆవరణలో అష్టాదశ అయ్యప్ప కలశాల పడిపూజను నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం నిర్వహించిన స్వామి మహాపడి పూజ కనుల పండువగా సాగింది. ఆలయ అర్చకులు వైద్యరాజు పంతులు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య పూజ నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలను నిర్వహించారు. ఈ మహాపడి పూజలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గీతా విద్యా సంస్థల అధినేత రామాంజనేయులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ పూజలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఆలయ భక్త బృందం పాల్గొన్నారు.

అట్టహాసంగా అష్టాదశ కలశాల పడిపూజ

నారాయణఖేడ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణ శివారులోని దోవురు లొంక హనుమాన్ ఆలయంలో గురువారం అయ్యప్ప దీక్షాధారులు అట్టహాసంగా అయ్యప్ప అష్టాదశ కలశాల పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు గురురాజశర్మ, అయ్యప్పస్వామితో పాటు గణపతి, కుమారస్వామి, విగ్రహాలకు పూజలు నిర్వహించడమే కాకుండా అభిషేకం, మెట్ల పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి లక్ష పుష్పార్చన

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల శ్రీధర శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని నిర్వహించారు. రామచంద్రగౌడ్ ఆధ్వర్యంలో, గంగాధరశర్మ గురుస్వామి వైదిక పర్యవేక్షణలో మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, కోశాధికారి ప్రేమ్‌సాగర్, ఉపాధ్యక్షుడు శేషగిరి, రాజు, గోపాల్, గురుస్వాములు పాల్గొన్నారు.

కొండాపూర్‌ను సందర్శించిన కిషన్‌సింగ్



కిషన్‌సింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సంగ్రాం మహరాజ్, రవీందర్‌నాయక్

నారాయణఖేడ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం కొండాపూర్‌లోని చరిత్రాత్మక హనుమాన్ ఆలయాన్ని గురువారం రాష్ట్ర రవాణాశాఖ ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్ సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్ ఆయనకు ఆశీస్సులు అందించి, ఆలయ ప్రాముఖ్యతను వివరించారు. ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ బలరాముడి చిత్రంతో కూడిన జ్ఞాపికను కిషన్‌సింగ్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పనిచేసే పార్టీ సీపీఐ

- సీపీఐ మెదక్ జిల్లా కార్యదర్శి కాలేక్



నర్సాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

నర్సాపూర్/నారాయణఖేడ్/జహీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాల కోసం పనిచేసే పార్టీ సీపీఐ అని ఆ జిల్లా కార్యదర్శి కాలేక్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా నర్సాపూర్‌లో కాలేక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజాగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో సీపీఐ వందేళ్ల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు దత్తురెడ్డి, చిరంజీవి, పుప్పాల అశోక్, సతీష్, ప్రేమ్‌కుమార్, బాలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని భరత్‌నగర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

- టీఆర్ఈఐ సొసైటీ సెక్రటరీ రమణకుమార్



లింగంపల్లి గురుకుల పాఠశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న రమణకుమార్

మునిపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని టీఆర్ఈఐ సొసైటీ సెక్రెటరీ రమణకుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట గురుకుల అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

ఖేడ్‌లో బాలవీర్ దివాస్



ఖేడ్‌లో బాల్‌వీర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీంఆర్మీ బాధ్యులు

నారాయణఖేడ్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం భీంఆర్మీ ఆధ్వర్యంలో బాలవీర్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఫతేసింగ్, జోరావర్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీంఆర్మీ జిల్లా కార్యదర్శి ఉమాసింగ్ మాట్లాడుతూ సిక్కుమత 10వ గురువు గురు గోవింద్‌సింగ్ కుమారులు ఫతేసింగ్, జోరావర్‌సింగ్‌లు ఇస్లాం మతంలోకి మారడానికి నిరాకరించినందుకుగానూ 1704 డిసెంబరు 26న ఔరంగాజేబు సైన్య దళపతి సిర్హాండ్ నవాబ్ ఇటుక గోడల్లో సజీవంగా బంధించి చంపేశారన్నారు. ధర్మం కోసం ఆ బాలలు చేసిన ప్రాణ త్యాగానికి గుర్తుగా వీర బాల దివాస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భీంఆర్మీ జిల్లా, స్థానిక బాధ్యులు అనుముల తుకారం, కిషన్‌సిగ్, మోహన్, భీంసేన, పండరి పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం: డీఎం



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో డీఎం జాకీర్‌హుస్సేన్

జహీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు గురువారం ప్రగతిచక్రాల పేరుతో పురస్కారాలు, నగదును అందజేసి మాట్లాడారు. అందరం కలిసి కృషిచేస్తేనే సంస్థను కాపాడుకోగలుగుతామన్నారు. ఉద్యోగులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాజు

నారాయణఖేడ్/నిజాంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సభలో సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా నారాయణఖేడ్‌కు చెందిన రాజు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా రాజాపూర్ ఆకాష్ ఎన్నికయ్యారు. నారాయణఖేడ్ నుంచి జిల్లా, రాష్ట్ర కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కడం పట్ల స్థానిక ఏబీవీపీ బాధ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏబీవీపీ రాష్ట్ర ఖేల్‌కో కన్వీనర్‌గా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బండారి ప్రశాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించారు.

ఏడాది దాటినా అందని 'ఉపాధి' డబ్బులు

నాగల్‌గిద్ద, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్‌లో ఈజీఎస్ పనులు జరిగి ఏడాది దాటినా ఇప్పటివరకు తమకు డబ్బులు చెల్లించడం లేదని గ్రామానికి చెందిన పలువురు ఉపాధిహామీ కూలీలు గురువారం పంచాయతీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఇతరుల పేర్లపై హాజరు వేసుకొని డబ్బులను స్వాహా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పనుల్లో కూలీలకు డబ్బులు చెల్లించాలని, అవకతవకలకు తావివ్వకుండా పనులు కొనసాగించాలన్నారు.